సాక్షి కుమురం భీం

శుక్రవారం । 12 । మే । 2023



నర్స్.. అమ్మ
రోగులు కోలుకునే వరకు మనోధైర్యం అందించేది నర్సులే. వారి సేవలు వెలకట్టలేనివి. నేడు ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా కథనం. 10లో▸



క్రీడా మైదానం కలేనా!
రెబ్బెన వాసులకు ఏళ్లుగా క్రీడామైదానం ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. ప్రభుత్వ స్థలం లేదని సాకుతో మైదానం ఏర్పాటు చేయడం లేదు. 11లో▸

గరిష్టం/కనిష్టం
43.3 /27.6

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశంలో అక్కడక్కడ మబ్బులు ఉంటాయి. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. వేడి అధికంగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులు ఈ నెల 16 లోగా సప్లిమెంటరీ పరీక్ష ఫీజులు చెల్లించాలని డీఐఈవో శ్రీధర్ సుమన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులు వార్షిక పరీక్ష ఫీజు రూ.500, ప్రాక్టికల్ ఫీజు రూ. 210, బ్రిడ్జి కోర్సు ఫీజు రూ.160 చెల్లించాలని సూచించారు. కళాశాల సిబ్బంది ఆన్‌లైన్‌లో కన్ఫర్మేషన్ చేసి ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. విద్యార్థులు మార్కుల మెమో జిరాక్స్‌లతో ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

'పది' విద్యార్థులు 26లోగా చెల్లించాలి
పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 26 లోగా సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సబ్జెక్టుల లోపు ఉన్న వారు రూ.110, ఎక్కువ సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించని వారు రూ.125 ఫీజు చెల్లించాలని సూచించారు. జూన్ 14 నుంచి 22 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

సదాశివ మాస్టారుకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, తెలంగాణకు చెందిన తెలుగు, ఉర్దూ రచయిత డాక్టర్ సామల సదాశివ మాస్టారు జయంతిని గురువారం పద్మశాలి సేవా సంఘం, తెలుగు సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు పాల్గొన్ని సదాశివ మాస్టారు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక పద్మశాలి భవనంలో సామల చిత్రపటానికి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం నాయకులు సామల సదాశివతో ఉన్న అనుబంధాన్ని, ఆయన రచనలను గుర్తు చేసుకున్నారు.


నగదు చెల్లించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో జీవో నంబర్-59 ప్రకారం భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారు నగదు చెల్లించాలని ఆసిఫాబాద్ తహసీల్దార్ రామ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిలు చెల్లించి రెండురోజుల్లో క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. డిమాండ్ నోటీసుల ప్రకారం చలాన్లు కట్టని వారు అప్రమత్తం కావాలని పేర్కొన్నారు.

రేపు ఎకనామిక్స్ పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల వాయిదా పడిన ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ ఎకనామిక్స్ పరీక్ష శనివారం నిర్వహించనున్నట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న శాంతికుమారి

ఆసిఫాబాద్‌రూరల్: దేశవ్యాప్తంగా విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టీఎఫ్‌ఐ జనరల్ కౌన్సిల్ సభ్యురాలు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. కేరళలో గురువారం నిర్వహించిన స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్‌ఐ) జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో జిల్లా నుంచి ఆమె హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ విద్య బలోపేతానికి చేపట్టే కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిర్వహిస్తున్న సైన్స్ సమ్మర్‌క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌సీఆర్‌టీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ సురేష్‌బాబు విద్యార్థులకు సూచించారు. గురువారం జాతీయ టెక్నాలజీ డేను పురస్కరించుకుని డీఈవో యాదయ్యతో కలిసి సైన్స్ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులు విజ్ఞాన అంశాలపై దృష్టి కేంద్రీకరించి ప్రత్యక్షంగా ప్రయోగాలు చేయడంపై డీఎస్‌వో మధుబాబు వివరించారు.

ఉపాధి భారం

ఊరికి దూరం..



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఉపాధి కూలీ పేరు మహదేవుని విజయలక్ష్మి. రెబ్బెన మండలం గోలేటి గ్రామం. వీరికి గ్రామం నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉపాధి పనులు కేటాయించారు. దీంతో ప్రతిరోజూ 14 కిలోమీటర్లు వెళ్లిరావాల్సి వస్తోంది. ఈ ఒక్క గ్రామంలోనే కాదు.. జిల్లాలో పలుచోట్ల ఉపాధిహామీ పనులు గ్రామాలకు దూరంగా చేపడుతుండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- గ్రామాలకు దూరంగా ఉపాధిహామీ పనులు
- వసతుల కల్పనపై అధికారుల నిర్లక్ష్యం
- ఎండలతో కూలీలకు తీవ్ర ఇబ్బందులు
- జిల్లాలో 1,67,012 మంది కూలీలు



రెబ్బెన మండలం గోలేటిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

తిర్యాణి(ఆసిఫాబాద్): కొద్దిరోజుల పాటు అకాల వర్షాలతో చల్లబడిన వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా 40 డిగ్రీల మార్కును దాటుతున్నాయి. ఎండలు తీవ్రంగా పెరిగిన సమయంలో ఉపాధిహామీ పనులు గ్రామాలకు దూరంగా చేపట్టడం కూలీలకు భారంగా మారింది. ఉదయం 9 గంటలకు భానుడు ప్రతాపం చూపిస్తుండగా, కిలోమీటర్ల దూరం వెళ్లిరావడం కష్టమవుతోంది. పనులు పూర్తి చేసి ఇళ్లకు చేరుకునేసరికి మధ్యాహ్నం 12 గంటలు దాటుతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో భిన్న పరిస్థితులు..

పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో 2005లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో మొత్తం 90,251 జాబ్‌కార్డులు ఉండగా, 1,67,012 మంది కూలీలు పనిచేస్తున్నారు. జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, తిర్యాణిలో కొండ ప్రాంతాలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ ఉపాధి పనులు చేయాలంటే కొండలు ఎక్కాల్సిందే. అలాగే మైదాన ప్రాంతాల్లోనూ చేలు అటవీప్రాంతాల వరకు విస్తరించి ఉంటాయి.

జిల్లాలో ఎండలు జోరందుకున్నాయి. వడగాలులకు ఉదయం 9 నుంచే వేడి అధికంగా ఉంటోంది. ఈ తరుణంగా ఉపాధి హామీ పని ప్రదేశంలో వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించడం లేదు. గతంలో నీడ కోసం టెంట్లు, కూలీలు గాయపడితే చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచేవారు. ప్రస్తుతం అలాంటి సౌకర్యాలు లేకపోవడంతో కూలీలు గంటల తరబడి ఎండలోనే పనులు చేస్తున్నారు. కనీసం తాగునీటిని నీడన ఉంచేందుకు అవకాశం లేకపోవడంతో వేడి నీటినే తాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరి వేసవి భత్యం కూడా అందించకపోవడంతో అనేక మంది పనులకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్ కారణంగా వేసవి భత్యం, తాగునీరు, పార, గడ్డపార వినియోగించినందుకు ఇచ్చే అలవెన్సుల ఆప్షన్ కనిపించడం లేదు. ప్రభుత్వం నుంచి గడ్డపారల పంపిణీ కూడా ఆగిపోయింది.

దూరంగా పనిప్రదేశాలు..

సహజంగా గ్రామ శివారు ప్రాంతాల్లో రైతుల చేల అభివృద్ధి, చెరువులు, కుంటల తవ్వకం కోసం ఉపాధి పనులు చేపడుతుంటారు. పల్లెల్లో చేలను రైతులు ఇప్పటికే అభివృద్ధి చేసుకున్న నేపథ్యంలో గ్రామాలకు దూరంగా పనులు కేటాయిస్తున్నారు. గ్రామానికి ఐదు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో పనిప్రదేశం ఉంటే కిలోమీటర్‌కు కొంత నగదును కూలితోపాటు జమ చేసేవారు. ప్రస్తుతం కూలీలకు గరిష్ట రూ.272 వరకు పెంచారు. దూర ప్రాంతాలకు వెళ్లి ఎండలో పనిచేస్తున్నా సగటున రూ.150 కూడా దాటడం లేదని కూలీలు చెబుతున్నారు.

వేసవి భత్యం చెల్లించాలి



గతంలో వేసవిలో పనిచేస్తే కూలితోపాటు అదనంగా 20- 30 శాతం వేసవి భత్యం చెల్లించేవారు. మంచినీళ్లు, గడ్డపార, తట్టలకు కూడా డబ్బులు ఇచ్చేవారు. దీంతో ఎండలకు తక్కువ పనిచేసినా గిట్టుబాటు అయ్యేది. ప్రస్తుతం అవన్నీ తీసేయడంతో పనికి వెళ్లినా ప్రయోజనం ఉండటం లేదు. పాత విధానంలో పనులు చేపట్టాలి. – జాడి తనేశ్, ఖమాన, మం.వాంకిడి

ఎండలోనే పనులు



ఉపాధి పనులు చేసే ప్రదేశంలో అధికారులు ఎలాంటి సదుపాయాలు కల్పించలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోనే పనిచేస్తున్నాం. కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఊరికి దూరంగా పనులకు వెళ్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి అలవెన్సులు అందడం లేదు. కిలోమీటర్ల దూరం వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంది.
– దుర్కెట్టి సతీశ్, తిర్యాణి

పంచాయతీలదే బాధ్యత

గతంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కూలీలకు టెంట్లు, ఫస్ట్ ఎయిడ్‌బాక్సులు ఏర్పాటు చేసేవాళ్లం. కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆ బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పని ప్రదేశంలో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తాం.
– సురేందర్, డీఆర్‌డీవో

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- రెబ్బెన పోలీస్‌స్టేషన్ తనిఖీ



రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): పోలీసులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పెండింగ్ కేసులు, దర్యాప్తు వివరాలను ఎస్సై భూమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసుల రికార్డులు పరిశీలించారు. రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారెక్, టెక్నికల్ రూంలను పరిశీలించి, స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. రిసెప్షన్ కౌంటర్‌ను సందర్శించి డైరీని పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయటమే పోలీసుల ప్రథమ కర్తవ్యమన్నారు. ప్రతీ పోలీసు చట్టాలను స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్ట పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజూ వాహనాల తనిఖీలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. రాత్రి పెట్రోలింగ్‌లో డ్యూటీ అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలని సూచించారు. అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెబ్బెన సీఐ అల్లం నరేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూలే అడుగు జాడల్లో నడవాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, పక్కన ఎమ్మెల్యే ఆత్రం సక్కు, తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రతిఒక్కరూ మహాత్మా జ్యోతిబా పూలే అడుగుజాడల్లో నడవాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. కెరమెరి మండలం నిసాని గ్రామంలో గురువారం నిర్వహించిన పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పూలే దంపతులు సమాజానికి ఎనలేని సేవలందించారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి పనిచేసి, సమాజంలోని అన్ని మతాలు, కులాల ఐక్యతకు కృషి చేసిన వ్యక్తి పూలే అని కొనియాడారు. ఆ కాలంలోనే మహిళలకు చెప్పిన ఘనత సావిత్రీబాయి పూలేకు చెందుతుందన్నారు. పూలే మార్గం అందరికీ అనుసరణీయమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ కలాం, మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్, జిల్లా అధ్యక్షుడు మెంగాజీ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఎం గోపాల్

దహెగాం(సిర్పూర్): రైతులు తీసుకువచ్చిన నాణ్యమైన ధాన్యానికి కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందని పౌరసరఫరాల శాఖ డీఎం గోపాల్ అన్నారు. మండల కేంద్రంతోపాటు లగ్గాం, ఒడ్డుగూడలోని కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. అమ్మకానికి తీసుకువచ్చిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 17 శాతం లోపు తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు. ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత చెత్తాచెదారం, తాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు తమ వెంట ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం, పట్టా పాస్‌బుక్ తెచ్చుకోవాలన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట సీఈవో బక్కయ్య, ఏఈవోలు శోభన్, వెన్నెల, సిబ్బంది నారాయణ, జీవన్ తదితరులు ఉన్నారు.

పోరాటం చేసే నాయకుడికే మద్దతు పలకాలి



పాదయాత్ర నిర్వహిస్తున్న హరీశ్‌బాబు

బెజ్జూర్(సిర్పూర్): ప్రజా సమస్యలపై పోరాటం చేసే నాయకుడికే ప్రజలు మద్దతు పలకాలని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పల్లె పల్లెకు పాల్వాయి- గడప గడపకూ బీజేపీ పాదయాత్రలో భాగంగా మండలంలోని లంబడిగూడ, బోగుడగూడ, సలుగుపల్లి, మద్దిగూడ గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. '15 ఏళ్లల్లో పట్టుమని 15 నిమిషాలు కూడా అసెంబ్లీలో మాట్లాడని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మనకు అవసరమా' అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయమని, అసెంబ్లీలో మాట్లాడమని అసెంబ్లీకి పంపిస్తే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'సమష్టి' విజయం

- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు
- ఆరేళ్లుగా రాష్ట్రంలో టాప్- 5లోనే జిల్లా
- ఇంటర్ ఫలితాల్లో వరుసగా ఈ ఏడాది కూడా ద్వితీయ స్థానం



వందశాతం ఫలితాలు సాధించిన తిర్యాణి కళాశాల

ఆసిఫాబాద్‌రూరల్: కొన్నేళ్లుగా ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లా సత్తా చాటుతోంది. సమష్టి కృషితో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. వరుసగా మరోసారి ద్వితీయ సంవత్సర ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా సెకండ్ ప్లేస్‌లో నిలిచింది. సమష్టి కృషితోనే విజయం దక్కిందని అధికారులు చెబుతున్నారు. ఇంటర్ విద్యార్థులకు రెండు నెలలపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వారం వారం స్లిప్ టెస్టులు పెడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కళాశాలల్లో ఎప్పటికప్పుడు టెస్టులు నిర్వహిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేయడంతోనే మంచి ఫలితాలు సాధించామని డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. అధ్యాపకుల పనితీరును ఆయన కొనియాడారు.

ప్రైవేట్ కంటే మెరుగైన ఫలితాలు..
జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 11 ఉండగా, 15 కేజీబీవీలు, ఐదు ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో 12 ప్రభుత్వ, కేజీబీవీ కళాశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రైవేట్‌కు దీటుగా మార్కులు సాధించారు. ఎంజేపీలో చదువుతున్న బైపీసీ విద్యార్థి దీపిక 985 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు సాధించింది. అలాగే మొదటి సంవత్సరంలో కేజీబీవీకి చెందిన శైలజ 464 మార్కులు సాధించింది. జిల్లాలో ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఏ ఒక్క విద్యార్థి కూడా ప్రభుత్వ కళాశాల విద్యార్థుల కంటే మెరుగైన ఫలితాలు సాధించలేదు. ప్రభుత్వ కళాశాలలు మెరుగైన ఫలితాలు సాధించడంపై కలెక్టర్ హేమంత్ బోర్కడే సైతం హర్షం వ్యక్తం చేశారు. మొదటి సంవత్సరంలో జైనూర్ కేజీబీవీ, తిర్యాణి టీటీడబ్ల్యూఆర్, గన్నారంలోని జ్యోతిబా పూలే విద్యాలయం, కెరమెరి, తిర్యాణి, వాంకిడి కేజీబీవీలు వందశాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, ద్వితీయ సంవత్సరంలో టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ బాలురు/బాలికలు సిర్పూర్(టి), టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ బాలికలు ఆసిఫాబాద్, బెజ్జూర్ కేజీబీవీ, టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలికలు బెజ్జూర్, గన్నారంలోని జ్యోతిబా పూలే విద్యాలయం వందశాతం ఫలితాలు సాధించాయి. ఆయా కళాశాలల్లో అధికంగా వ్యవసాయ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులే చదువుకుంటున్నారు. మారుమూల గ్రామాల నుంచి కళాశాలలకు వస్తున్నారు. వీరి పరిస్థితిని గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులు మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో కూడా నీట్, ఎంసెట్ శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఆరేళ్ల ఫలితాలు..

సంవత్సరం	పరీక్ష రాసిన విద్యార్థులు	ఉత్తీర్ణత	శాతం	జిల్లా స్థానం
2018 ఫస్టియర్	3,227	2,296	71	03
సెకండియర్	3,202	2,562	80	01
2019 ఫస్టియర్	3,350	2275	67.9	03
సెకండియర్	3,009	2,282	75	02
2020 ఫస్టియర్	3,856	2,739	71	02
సెకండియర్	3,078	2,487	80	01
2021 ఫస్టియర్	5,252	3,716	70	03
సెకండియర్	4,826	3,678	76	02
2022 ఫస్టియర్	5,137	3,748	72	03
సెకండియర్	4,697	3,793	80	02
2023 ఫస్టియర్	4,371	3,227	74	03
సెకండియర్	4,000	3,249	81	02

అందరి సహకారంతోనే..



కళాశాలల అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది సహకారంతోనే ఇంటర్ ఫలితాల్లో మెరుగ్గా నిలిచాం. ప్రభుత్వ కళాశాలల్లో ప్రణాళిక ప్రకారం బోధన చేపట్టాం. సకాలంలో సిలబస్ పూర్తి చేయడంతోపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాం. ప్రైవేట్, కార్పొరేట్ దీటుగా ఫలితాలు సాధించడం ఆనందంగా ఉంది.
– శ్రీధర్‌సుమన్, డీఐఈవో

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

కౌటాల: మండలంలోని తాటిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మహారాష్ట్రంలోని నాగ్‌పూర్‌కు చెందిన ధమ్మ సారధి భదంత్ భంతేజీ గురువారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహార్ కులస్తులు ధమ్మ ర్యాలీ తీశారు. అంబేద్కర్ విగ్రహానికి భంతేజీ పూలమాలలు వేశారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం ప్రజలకు అన్నదానం నిర్వహించారు. రాత్రి నాగ్‌పూర్ కళాకారులతో ఉచిత డబుల్ దుయ్యం కవ్వాలి ప్రదర్శన చేశారు. మహార్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న భంతేజీ, మహార్ నాయకులు

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగరేణి కేకే–1 డిస్పెన్సరీ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు గురువారం మృతిచెందినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఎక్కడి వ్యక్తి అనేది తెలియదని, కొన్ని రోజులుగా డిస్పెన్సరీ వద్ద వెహికిల్ షెడ్డులో ఉంటున్నాడని పేర్కొన్నారు. డిస్పెన్సరీ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై ఎరుపు, తెలుపు గీతల లుంగీ ఉందని, సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని సూచించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 31వ వార్డులో గురువారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, కృష్ణ, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

కుంటాల(ముధోల్): పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను చేరవేస్తున్న ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. మండలంలోని కల్లూర్‌లో జాతీయ రహదారిపై గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కల్లూర్ నుంచి కుంటాలకు వెళ్తున్న ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తుండగా వాహనాన్ని ఆపి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రతిఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫ్లెక్సీ షాపులో చోరీ



సీసీ ఫుటేజీలో దొంగలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో రోజురోజుకూ చోరీలు పెరిగిపోతున్నాయి. ఇటీవల అత్యధికంగా ద్విచక్ర వాహనాలు, తాళం వేసి ఉన్న ఇళ్లకు కన్నం వేసిన విషయం విదితమే. తాజాగా గురువారం తెల్లవారు జామున జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల ఐడియా ఫ్లెక్సీ షాపు వెనుక భాగంలో ఇద్దరు చోరీకి పాల్పడ్డారు. షాపులో ఉన్న కూలర్‌తో పాటు సింటెక్ వాటర్ ట్యాంక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సమీపంలోని ఓ సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. గతంలో కూడా బస్టాండ్ ప్రాంతంలో దొంగతనాలు జరిగాయి.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

లోకేశ్వరం(ముధోల్): ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం వట్టోలి గ్రామానికి చెందిన మేత్రి భూమన్న(45) రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయంకాలేదు. దీంతో మనస్థాపానికి గురయ్యాడు. గురువారం ఉదయం చిన్న వట్టోలి ప్రాంతంలో వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సాగరబాయి, కుమారుడు ఉన్నారు.

నర్స్.. అమ్మ



రోగులకు సేవలు అందిస్తున్న స్టాఫ్ నర్సు (ఫైల్)

- నిస్వార్థ సేవకు వారు ప్రతిరూపం
- ఎన్ని కష్టాలు ఉన్నా.. మోములో చెరగని చిరునవ్వు
- సొంతవారిలా రోగులకు సపర్యలు
- రోగుల ఆలన..పాలన వారి బాధ్యతే
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ఆస్పత్రికి వెళ్లగానే అమ్మలాంటి ఓ ఆత్మీయ పలకరింపు.. ఎంత ఆపదలో ఉన్నా ఏమీ కాదని ధైర్యం చెప్పే స్నేహితురాలు.. మంచంపై కదలలేని వారిని తన వారిగా భావించి సపర్యలు చేసే సేవకురాలు.. వ్యాధి నయమై డిశ్చార్జి అయ్యే వరకూ మానసిక ధైర్యం అందించే కౌన్సిలర్. డాక్టర్ వైద్యం చేసినా.. కుటుంబ సభ్యులుగా రోగులకు మనోధైర్యం అందించేది మాత్రం నర్సులే. నర్సుల సేవలు వెలకట్టలేనివి. వారి రుణం తీర్చుకోలేనిది. కులం, మతం, పేద, ధనిక అని తేడా లేకుండా నిస్వార్థంగా సేవ చేసే వారు. వైద్యుల సలహా మేరకు మందులు ఇస్తారు. అమ్మలా ఆత్మీయత పంచుతారు. ఓ అక్కలా సలహాలిస్తారు. స్నేహితురాలిలా అండగా ఉంటారు. రోగులకు సేవచేయడమే జీవిత పరమార్థంగా భావించి 'లేడీ ఆఫ్ ది ల్యాంప్'గా ఖ్యాతికెక్కిన సేవామూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు సందర్భంగా ఏటా మే 12న ప్రపంచ నర్సుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఉమ్మడి జిల్లా నర్సులపై ప్రత్యేక కథనం.

– మంచిర్యాలటౌన్

నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తింపు...

ప్రజలకు వైద్య సేవలందిస్తున్న నర్సులను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తించింది. నర్సింగ్ ఆఫీసర్లుగా పిలవాలని సూచించింది. దీంతో వారికి ప్రజల్లో గౌరవ హోదా లభించింది.

ఒకేసారి 50 మందికి సేవలు..



బెల్లంపల్లి: సుమారు 14 ఏళ్ల క్రితం బెల్లంపల్లి కన్నాల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై జరిగిన బస్సు ప్రమాదంలో 50 మంది వరకు ప్రయాణికులు గాయపడ్డారు. ఆరోజు నేను డ్యూటీలో లేను. ఆస్పత్రిలో ఒక్కరే నర్సు ఉండడంతో క్షతగాత్రులకు వైద్యసేవలు అందించడానికి అత్యవసరంగా నన్ను పిలిపించారు. నా సర్వీసులో అంతమందికి సేవలందించడం అదే మొదటిసారి. వారిని ప్రాణాపాయం నుంచి కాపాడిన తీరు ఎప్పటికీ మర్చిపోలేను.

– షీలా, హెడ్‌నర్స్, బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి

తోబుట్టువులా ధైర్యం చెబుతా..



బెల్లంపల్లి: నర్సింగ్ వృత్తి అంటే నాకు చాలా ఇష్టం. మాఅక్క , చెల్లెలు కూడా ఇదే వృత్తి చేస్తున్నారు. ఆస్పత్రికి ఎంతోమంది గర్భిణులు ప్రసవం కోసం వస్తుంటారు. కొందరికి సర్జరీ చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో అనేకమంది భయపడుతుంటారు. వారికి ఓ తోబుట్టువుగా ధైర్యం చెబుతా. అప్పటి వరకు భయపడిన వారే ఆతర్వాత సర్జరీకి ముందుకువస్తారు.

– ఎలిజబెత్, స్టాఫ్‌నర్స్, ఏరియా ఆస్పత్రి, బెల్లంపల్లి

మర్యాదపూర్వకంగా ఉంటా..



బెల్లంపల్లి: వైద్యసేవల కోసం ఆస్పత్రికి వచ్చే రోగులను చిరునవ్వుతో పలకరిస్తే వారిలో ఆనందం నింపుతుంది. అందుకే రోగులతో మర్యాద పూర్వకంగా ఉంటా. దీంతో బాధతో వచ్చిన రోగులు ఆనందంగా చికిత్స పొందుతారు. డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లే సమయంలో కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించడం చూస్తుంటే ఆనందంగా ఉంటుంది.

– అన్నపూర్ణ, స్టాఫ్‌నర్సు, ఏరియా ఆస్పత్రి, బెల్లంపల్లి

ఆ రోజు మర్చిపోలేను..



చెన్నూర్: గత నెలలో నైట్ డ్యూటీ చేస్తున్న సమయంలో డెలివరీ కేసు వచ్చింది. కేసు కొంచెం క్రిటికల్‌గా ఉండడంతో రెఫర్ చేయకుండా ధైర్యంగా వైద్యురాలు సహాయంతో డెలివరీ చేశాం. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. వృత్తి పరంగా ఎన్నో కాన్పులు చేసినా ఆ కుటుంబ సభ్యుల సంతోషాన్ని చూస్తే చాలా ఆనందం కలిగింది. ఆ రోజు బెస్ట్ డేగా గుర్తిండిపోతుంది.

– అరుణ, నర్సు, సీహెచ్‌సీ, చెన్నూర్

తల్లికి బిడ్డను అందిస్తుంటే..



రెబ్బెన: మా చేతుల మీదుగా డెలివరీ చేసి తల్లికి బిడ్డను అందించే సమయంలో చెప్పలేని సంతోషం అనిపిస్తుంది. అలాంటి అదృష్టం అందరికీ దక్కదు. 27 ఏళ్ల పాటు ఏజెన్సీ ప్రాంతంలోనే సేవలు అందించా. అమాయక గిరిజనులకు సేవ చేస్తుంటే చెప్పలేని ఆనందంగా ఉంటుంది. ఆ సంతృప్తి మరెక్కడా లభించదు.

– సాజిదాబాను స్టాఫ్‌నర్స్, రెబ్బెన పీహెచ్‌సీ

పేదలకు సేవచేయాలనే..



రెబ్బెన: పేద ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో నర్సింగ్ విద్యను అభ్యసించా. రెబ్బెన పీహెచ్‌సీలో స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్నా. కొన్ని సందర్భాల్లో గంటల తరబడి డెలివరీ చేయాల్సి వస్తుంది. పుట్టిన బిడ్డను చూడగానే అప్పటి వరకు పడిన కష్టం మర్చిపోతాం.

– రజిత మాధురి, స్టాఫ్‌నర్స్, రెబ్బెన పీహెచ్‌సీ

ప్రశంసపత్రం అందుకున్నా..



మంచిర్యాలటౌన్: నేను 2001లో నర్సు ఉద్యోగంలో చేరా. ఆస్పత్రిలో చేరిన రోగులకు వైద్యసేవలు అందించి ఆరోగ్యంగా తిరిగి వెళ్లేలా చూస్తాం. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలు అందించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ స్టాఫ్‌నర్సుగా ప్రశంస పత్రం అందుకున్నా.

– మంజుకుమారి, స్టాఫ్‌నర్సు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మంచిర్యాల

ఆనందంగా ఉంది



మంచిర్యాలటౌన్: 2011లో విధుల్లో చేరా. ఆదిలాబాద్ రిమ్స్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలో బెస్ట్ నర్సుగా పలుమార్లు ప్రశంస పత్రాలు అందుకోవడం ఆనందంగా ఉంది. ఏడాది నుంచి మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్నా.

– ఉమ, స్టాఫ్‌నర్సు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మంచిర్యాల

సేవలు చేస్తేనే గుర్తింపు



ఆసిఫాబాద్‌అర్బన్: ఏ వృత్తిలోనైనా బాధ్యతతో విధులు నిర్వహిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుంది. 2010లో విధులో చేరా. మారుమూల ప్రాంతాల పీహెచ్‌సీల్లోని ప్రజలకు సేవలు అందించడం తృప్తినిచ్చింది. కోవిడ్ బాధితులకు సేవలు అందించడం మర్చిపోలేని గొప్ప అనుభూతినిచ్చింది.

– సంధ్య, స్టాఫ్‌నర్స్, ఆసిఫాబాద్

పారితోషికాలు ఇవ్వాలి



ఆసిఫాబాద్‌అర్బన్: రాత్రింబవళ్లు ఆస్పత్రుల్లో నర్సులు రోగులకు సేవలు అందిస్తారు. అలాంటి వారికి ప్రభుత్వం పారితోషికాలు అందించాలి. పలు సందర్భాల్లో ఆస్పత్రికి వచ్చే వారు మద్యం మత్తులో ఇష్టారాజ్యంగా మాట్లాడినా ఓపికతో సర్దిచెప్పి చికిత్స చేసి పంపిస్తాం. ఈ వృత్తిలో ఓపిక ఎంతో అవసరం.

– గౌసియాబేగం, హెడ్‌నర్స్

అదృష్టంగా భావిస్తున్నా



కౌటాల: కౌటాల పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సుగా సేవలు అందిస్తున్నా. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించడాన్ని ప్రభుత్వం గుర్తించింది. గతేడాది హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో నిర్వహించిన నర్సుడే వేడుకల్లో మంత్రి హరీశ్‌రావు శాలువాతో సత్కరించి ప్రశంసపత్రం అందించారు. నర్సు వృత్తిలో సేవచేయడం అదృష్టంగా భావిస్తున్నా.

– దుర్గం వర్ష, స్టాఫ్‌నర్సు, కౌటాల

16 ఏళ్లుగా వైద్యసేవలు



కౌటాల: కౌటాల పీహెచ్‌సీలో పదేళ్లుగా నర్సుగా సేవలందిస్తున్నా. వైద్యుల సహకారంతో రాష్ట్రంలోనే ఎక్కువగా కౌటాల పీహెచ్‌సీలో సాధారణ కాన్పులు చేస్తున్నాం. ఇటీవల కేంద్ర వైద్య క్వాలిటీ బృందం మాసేవలను గుర్తించడం సంతోషంగా ఉంది. ఉత్తమ వైద్యసేవలు అందిస్తున్నప్పటికీ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆరోపించినప్పుడు బాధగా ఉంటుంది.

– కె.సునీత, స్టాఫ్ నర్సు, కౌటాల

ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణకు డీడీ కట్టాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకుని పట్టాలు పొందగోరే ప్రతిఒక్కరూ వెంటనే డీడీలు చెల్లించి పట్టాలు పొందాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. గురువారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. జీవో 76కు సంబంధించి సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న వారు ఇంకా 450 మంది వరకు డీడీలు కట్టాల్సి ఉందన్నారు. వీరంతా మరో వారం రోజుల్లోగా డీడీలు చెల్లించేలా వార్డు కౌన్సిలర్లు, ఆర్పీలు చొరవ తీసుకోవాలన్నారు. అవసరమైతే ఇంటింటికీ వెళ్లి డీడీలు కట్టేలా చూడాలన్నారు. 2014 కన్నా ముందు సింగరేణి స్థలాల్లో ఇండ్లు కట్టుకున్న వారికే పట్టాల కోసం అవకాశముండగా ప్రభుత్వం దానిని సవరిస్తూ 2020 వరకు పొడిగించిందన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, మంచిర్యాల ఆర్డీవో వేణు, మందమర్రి తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కమిషనర్ వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఇళ్ల క్రమబద్ధీకరణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆర్డీవో శ్యామలాదేవి , మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్ మధుసూదన్ పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగుపర్చాలి



జిల్లా వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు మరింత మెరుగు పర్చాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణుల నమోదు చేయాలని, పరీక్షలు పెంచాలని, రక్తహీనత కేసుల వివరాలను ఎప్పటికప్పుడు రిపోర్టు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, అపర్ణ, స్టాఫ్‌నర్సులు వరలక్ష్మి, పుష్పలత, డెమో బుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

మంచిర్యాలటౌన్: అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఆఫ్‌లైన్‌లో సమీక్షించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఓపీ విధుల కోసం సమయాన్ని కేటాయించడంతోపాటు ఆ రోజు జరిగిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. సాధారణ ప్రసవాలు పెంచేలా గర్భిణులను సంసిద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు విజయపూర్ణిమ, నీరజ, అనిత పాల్గొన్నారు.

మెరుగైన వేతన ఒప్పందం సాధిస్తాం

- బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్



మాట్లాడుతున్న పేరం రమేశ్

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఈ నెల 19న కోల్‌కత్తాలో నిర్వహించనున్న 11వ వేజ్‌బోర్డు సమావేశంలో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం సాధిస్తామని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో కార్మికులతో మాట్లాడారు. వేజ్‌బోర్డు సమావేశాలు సజావుగా జరగడం బీఎంఎస్ కృషి ఫలితమే అన్నారు. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో సేఫ్టీ ట్రిపార్టీయేట్ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21, 22 తేదీల్లో ధన్‌బాద్‌లోని డీజీఎంఎస్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కమిటీ సభ్యులు కాదాసి భీమయ్య, పీ.వినోద్‌కుమార్, నాయకులు సత్తయ్య, పిట్ సెక్రెటరీ ఆనంద్, నరేశ్, గోపు సందీప్, శ్రీనివాస్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే'



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వివేక్



బెల్లంపల్లిలో మోటారు సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వివేక్, బీజేపీ శ్రేణులు

బెల్లంపల్లి/తాండూర్: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ గడ్డం వివేక్ అన్నారు. గురువారం ఆయన బెల్లంపల్లి రైల్వే స్టేషన్ వద్ద బీజేపీ జెండా ఎగురవేశారు. తాండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతి, నియంతృత్వ పాలనకు ప్రజలు పాతరేయాలని పిలుపునిచ్చారు. తాండూర్, బెల్లంపల్లిలో మోటార్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. తాండూర్‌లో వీఓఏల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మునిమంద రమేష్, శ్రీనివాస్, నాయకులు ఏమాజీ, కె.రమేష్, తిరుపతి, రాజనర్సు, విజయ్, ఎం.శ్రీనివాస్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ సేవలు మరింత మెరుగు



మాట్లాడుతున్న కమిషనర్ హరిపచౌరీ

శ్రీరాంపూర్(మంచిర్యాల): సీఎంపీఎఫ్ సేవలు మరింత మెరుగుపరిచినట్లు ఆ శాఖ గోదావరిఖని రీజియన్ కమిషనర్ హరిపచౌరీ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డీజీఎం(పర్సనల్) అరవిందరావు అధ్యక్షతన సీఎంపీఎఫ్ ట్రిపార్ట్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హరిపచౌరీ సీఎంపీఎఫ్‌లో కొత్త నామినేషన్స్, సెటిల్మెంట్లకు సంబంధించిన వాటిపై అవగాహన కల్పించారు. పర్సనల్, అకౌంట్ డిపార్టుమెంట్ వారు కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ పత్రాలను ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏజెంట్ ఏవీరెడ్డి, డీవైపీఎం దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

బెల్లంపల్లి: బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ షాపుల డీలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బెల్లంపల్లి ఆర్డీవో కె.శ్యామలాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ 19, 20 వార్డుల పరిధి అశోక్‌నగర్‌లో (ఓసీ), బెల్లంపల్లి మండలం మాలగురిజాలలో (ఎస్సీ), భీమిని మండలం కేస్లాపూర్‌లో (ఎస్టీ–మహిళ), రాంపూర్ (ఎస్సీ), వీగాం (ఎస్టీ), కాసిపేట మండలం ముత్యంపల్లి (బీసీ–బీ), కన్నెపల్లి మండలం పోలంపల్లి (ఎస్సీ–మహిళ), టేకులపల్లి (ఓసీ–మహిళ) , నెన్నెల మండలం చిత్తాపూర్(ఓసీ–మహిళ) ఖాళీగా ఉన్నాయని, వాటిని ఆయా సామాజిక వర్గాల వారికి రిజర్వు చేశామన్నారు. తాండూర్ మండలం బోయపల్లి (ఎస్టీ–మహిళ), చౌటపల్లి (ఓసీ), రేచినీ (ఓసీ), ద్వారకాపూర్ (ఓసీ–మహిళ), అచ్చులాపూర్ (ఎస్సీ)లకు కేటాయించినట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15 నుంచి 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తుతోపాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను అంటించి సంబంధిత తహసీల్దార్ సంతకంతో ధృవీకరించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుతో పాటు నివాసం, కులం, పుట్టిన తేదీ, విద్యార్హత ధృవీకరణ పత్రాలను జత చేయాలన్నారు. రాతపరీక్షలో నెగ్గిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకోసం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు

మంచిర్యాలక్రైం: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బస్టాండ్ వద్ద 2015 ఫిబ్రవరి 22న ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ముగ్గురికి నాలుగేళ్ల జైలు, రూ.1500 చొప్పున జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జీ.ఉదయ్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. జైపూర్ మండలం నర్సింగపూర్ గ్రామానికి చెందిన పండుగు రాజన్న, వేముల రవీందర్‌గౌడ్, తోకల సాగర్ అల్లర్లకు పాల్పడుతుండడంతో అదే గ్రామానికి చెందిన బోయిని రాజేందర్, మరి కొందరు కలిసి నిలదీశారు. దీంతో రాజేందర్‌పై కక్షగట్టి హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. 2015 ఫిబ్రవరి 22న రాజేందర్, శ్రీకాంత్ ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వెళ్లి వస్తుండగా శ్రీరాపూర్ బస్టాండ్ వద్ద వారిని అడ్డుకుని రాడ్లు, కర్రలతో దాడిచేయడంతో రాజేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయమై శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై టీ.సంజీవ్ (ప్రస్తుతం మంచిర్యాల రూరల్ సీఐ) కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కోర్టు లైసన్ ఆఫీసర్ కే.శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ గులామ్ ధస్తాగిర్ సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మదన్‌మోహన్‌రావ్ నేరం రుజువు చేయడంతో నిందితులకు నాలుగేళ్ల జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. మండలంలోని హర్కపూర్‌తాండకు చెందిన జాదవ్ నాందేవ్ (47)వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా షుగర్, బీపీతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. కుటుంబ పోషణ భారం కావడమే కాకుండా కూతురికి వివాహం చేసేదెలా? అని మనస్థాపానికి గురయ్యాడు. గురువారం తెల్లవారు జామున ఇంట్లోనే దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సునీల్ గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య అరుణ, కుమారుడు కిరణ్‌కుమార్, కూతురు అర్చన ఉన్నారు.